www.vishvambhara.com తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...

(మొదటి పేజీ తరువాయి)

శాంతాబాయి కుటుంబానికి

విషయాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ముఖ్యమంత్రి మానవీయ కోణంలో స్పందిస్తూ, శాంతాబాయి కుటుంబానికి అవసరమైన తోడ్పాటును అందించాల్సిందిగా ఆదేశించారని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని జిల్లా అధికారులతో కూడిన బృందం ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారని అన్నారు. ప్రభుత్వం తరపున శాంతాబాయికి వృద్ధాప్య పెన్షన్, ఆమె ముగ్గురు కుమారులకు దివ్యాంగుల పెన్షన్ వస్తోందని వెల్లడించారు.

రైతులు బాగుంటే బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి విలువ తెలియని వాళ్లు పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలపై కోపంతో రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఉత్తమ్ స్పందించారు.

రూ.500 కోట్లతో ఎరుకల కార్పొరేషన్

త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎరుకల సామాజిక వర్గం అభివృద్ధి కోసం ఎరుకల సాధికారత పథకాన్ని కేసీఆర్ ప్రవేశపెట్టారని, ఆ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. పలు సందర్భాల్లో తాను శాసన మండలిలో ఈ అంశాన్ని లేవనెత్తానని, అయినా కూడా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమని స్పష్టం చేశారు. 50 వేల ఎరుకల కుటుంబాలకు రూ 60 కోట్ల మేర లబ్ధి చేకూర్చే ఈ పథకాన్ని మరింత మెరుగుపరిచి ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎరుకల సామాజిక వర్గ రాజకీయ అభి వృద్ధి కోసం కూడా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల సామాజిక వర్గానికి అన్ని పార్టీలు సముచిత అవకాశాలు కల్పించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారా యణకు ఎమ్మెల్సీ గా అవకాశం ఇస్తే అప్పటి గవర్నర్ అడ్డుకున్నారని అన్నారు. ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాలపై ఎంతలా అణిచివేత ఉందో చెప్పడానికి ఏకలవ్యుడి జీవితమే ఒక ఉదాహరణ అన్నారు. చరిత్రలో నిలబడిపోయే త్యాగం చేసిన ఏకలవ్యుడు అందరికీ స్ఫూర్తి ప్రధాత అన్నారు. ఆయన సమాజానికి మంచి మార్గం చూపించే ప్రయత్నం చేసి ఆరాధ్య దైవమయ్యారని కొనియాడారు. బహుజనలకు రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో సమాన అవ కాశాలు దక్కాలన్న ఉద్యమంలో తాను పాల్గ ంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఏకలవ్యుడి విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయించుకునే ప్రయత్నం చేద్దామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు రూప్ సింగ్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు, ప్రధాన కార్యదర్శి కుతాడి రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'గ్లోబల్ సౌత్'కు అన్యాయం..

అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత ఇలా ప్రతి విషయంలోనూ గ్లోబల్ సౌత్ దేశాలు బాధితులవుతున్నాయని అన్నారు. బ్రెజిల్‌లోని రియో డీ జనీరోలో నిర్వహించిన బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోడీ పాల్గొన్నారు. భారత్ సహా బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా దేశాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోడీ ప్రసంగిస్తూ.. పర్యావరణ పరిరక్షణ, సాంకేతికత అభివృద్ధి తదితర అంశాలపై ప్రపంచ సంస్థల నుంచి గ్లోబల్ సౌత్ దేశాలకు కనీస సహకారం ఉండటం లేదన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు లేకుండా ఈ సంస్థలన్నీ సిమ్‌కార్డు ఉన్నా.. నెట్‌వర్క్‌లేని మొబైల్‌ఫోన్ల లాంటివని వ్యాఖ్యానించారు."నేడు బహుళ ధ్రువ, సమ్మిళిత ప్రపంచం ఆవిష్కృతం కావాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వంటి ప్రపంచస్థాయి సంస్థల్లో సమగ్ర సంస్కరణలతోనే ప్రారంభం కావాలి. బ్రిక్స్‌ను విస్తరించడం, కొత్త స్నేహితులను ఇందులో భాగస్వాములను చేయడం.. కాలంతో పాటు ఆర్గనైజేషన్ మారు తోందని చెప్పేందుకు నిదర్శనం. 20వ శతాబ్దం నాటి టైప్‌రైటర్లతో 21వ శతాబ్దం నాటి సాఫ్ట్ వేర్ నడవదు. అలాగే, ప్రపంచస్థాయి సంస్థల్లో ఎప్పటికప్పుడు సంస్కరణలు చేపట్టాల్సిన అవ సరం ఉంది. భారత్ ఎప్పుడూ తన సొంత ప్రయోజనాలకంటే మానవాళి ప్రయోజనాల కోసం పని చేయడాన్నే బాధ్యతగా భావిస్తుంది. బ్రిక్స్ దేశాలతో కలిసి అన్ని అంశాలపై నిర్మాణాత్మక సహకారం అందించేందుకు భారత్ పూర్తిగా కట్టుబడి ఉంది" అని మోడీ స్పష్టం చేశారు.

రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు..

ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 25 వేల కిలోమీటర్ల మేర రెండు లైన్ల రోడ్లను నాలుగు లైన్లుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రముఖ పట్టణాలను కలుపుతూ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌పోర్ట్ నెట్ వర్క్ ఏర్పాటు, రోజుకు 100 కి.మీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం వంటి అంశాలు కేంద్రం అజెండాలో ఉన్నట్లు తెలిపారు. రవాణా రంగంలో సరికొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తున్నామని.. దీని ఫలితంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకోబోతున్నాయని గడ్కరీ వెల్లడించారు."ఇప్పటికే కొన్ని చోట్ల రోప్‌వే, కేబుల్ కార్ల కోసం ప్రత్యేక నిర్మాణాలు చేపట్టాం. రోడ్డు మార్గాలకు అనుకూలంగాలేని కేదార్‌నాథ్ లాంటి ప్రదేశాల్లో ఫ్యునిక్యులార్ రైల్వే మార్గాలను ఏర్పాటు చేస్తున్నాం. దేశ వ్యాప్తంగా 360 చోట్ల ఈ తరహా ప్రాజెక్టులు చేపడుతున్నాం. 60 చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో ప్రాజెక్టుకు రూ.200 నుంచి రూ.5000 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇవన్నీ పూర్తయితే.. రవాణా రంగంలో భారత ముఖచిత్రమే మారిపోతుంది. రోడ్డు మార్గాలను అభివృద్ధి చేయడం వల్ల కేవలం భారత ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించడమే కాదు..ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి, ఉద్యోగాల కల్పనలోనూ సాయపడుతుంది" అని గడ్కరీ వెల్లడించారు.

భారత్‌లోని జాతీయ రహదారులు నాణ్యత పరంగా ఏడాదిలోగా అమెరికా రహదారులతో పోటీపడతాయని గడ్కరీ ధీమా వ్యక్తం చేశారు. మెట్రోపాలిటన్ నగరాల్లో కేబుల్ ఆధారిత బస్సు సేవలు, ఎలక్ట్రిక్ రాపిడ్ ట్రాన్స్‌పోర్టు సేవలు అనుభవించేందుకు ఇంకా ఎంతో సమయం లేదన్నారు. పైలట్ ప్రాజెక్టుల కింద దిల్లీ, బెంగళూరు నగరాల్లో ఇప్పటికే మెట్రినో పాడ్ టాక్సిస్, హైపర్‌లూప్ సిస్టమ్స్‌ను త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారులకు సాంకేతికత తోడవుతోందని, దీంతో ఓ విప్లవం మొదలుకాబోతోందని చెప్పారు. మరోవైపు టాటా, టయోటా, హ్యుందాయ్, మహీంద్రా లాంటి ప్రముఖ వాహన తయారీ సంస్థలు ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇంజిన్ల తయారీకి ముందుకు వచ్చినట్టు గడ్కరీ వివరించారు. ఇది కార్యరూపం దాల్చితే.. ఒకే ఇంధనం కాకుండా పలు ఇంధనాలతో వాహనం నడిపేందుకు వీలవుతుందని చెప్పారు. ఫలితంగా శిలాజ ఇంధనాల దిగుమతి తగ్గుతుందన్నారు. ప్రధానంగా ఇథనాల్, మిథనాల్ లేదా జీవ ఇంధనాల మిశ్రమంతో వాహనాలు నడిచేలా ఇంజిన్లు తయారు చేయబోతున్నట్లు చెప్పారు.2013-2014 సమయంలో దేశ వ్యాప్తంగా 91,287 కి.మీ జాతీయ రహదారులుంటే... ప్రస్తుతం 1,46,204 కి.మీ విస్తరించి ఉన్నాయని గడ్కరీ పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే 60శాతం మేర నూతన జాతీయరహదారుల నిర్మాణం జరిగిందన్నారు. అంతేకాకుండా హైస్పీడ్ కారిడార్‌లు 2014 నాటికి 93కి.మీ ఉంటే ప్రస్తుతం 2,474 కి.మీ ఉన్నాయని గుర్తు చేశారు. ఎలక్ట్రిక్ రాపిడ్ ట్రాన్స్‌పోర్టు గురించి మాట్లాడుతూ..పైలట్ ప్రాజెక్టు కింద నాగ్‌పుర్‌లో 135 సీట్లతో విద్యుత్ బస్సు ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచామన్నారు.

చెంచుల సొంతింటి కల సాకారం

చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పలు సందర్భాలలో సూచించారని, సీఎం రేవంత్ సైతం గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి, ముఖ్యంగా వారి నివాస గృహాల నిర్మాణంపై చాలా సూచనలు చేశారని పేర్కొన్నారు. మొదటి విడతలో భాగంగా సోమవారం అచ్చంపేట నియోజకవర్గం మున్ననూర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి చెంచులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను స్వయంగా అందజేస్తున్నట్లు పొంగులేటి తెలిపారు. ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో మొత్తంగా 10, 836 ఇండ్లు మంజూరు చేయగా.. మంచిర్యాలకు 157, నిర్మల్ 153, ఆసిఫాబాద్ 3,371, బోథ్ 163, ఖానాపూర్ 2,257, సిర్పూర్ 227, ఆదిలాబాద్ 2,848, బెల్లంపల్లి 223 మంజూరు చేసినట్లు తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వరా వుపేటకు 274, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్‌లో అచ్చంపేట 785, మహబూబ్‌నగర్ 245, పరిగి 63, తాండూర్ 174, కొల్లాపూర్ 105, కల్వకుర్తి 120, వికారాబాద్ 63, దేవరకద్ర 64, నాగార్జునసాగర్ 17 మొత్తంగా 13,266 ఇండ్లను చెంచులకు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తున్నామని, ఐటీడీఏ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్ల చొప్పున 8,750 మంజూరు చేసినట్లు వెల్లడించారు.

ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల

(మొదటి పేజీ తరువాయి)

నిటారుగా నిలబడి పని చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మధిరలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కోటి పది లక్షల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు ఏదో ఒక సంక్షేమ కార్యక్రమాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధిడి వరకూ ఏదో ఒక సంక్షేమ కార్యక్రమం కేవలం ఏడాదిన్నర కాలంలోనే అందించాం అన్నారు. ప్రజల అవసరాలను ఓట్లుగా మార్చుకొని గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు వారి అవసరాలు తీర్చుకున్నారు తప్ప ప్రజల ఇబ్బందులు తీర్చలేదని డిప్యూటీ సీఎం ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. 10 సంవత్సరాలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు బిల్లులు కూడా మంజూరు చేయలేదని, పాలకులుగా విలాసవంతమైన జీవితాలు గడిపారు, రాష్ట్రం పై పడి దోచుకున్నారు తప్ప ప్రజల కష్టాలను పట్టించుకోలేదు అన్నారు. బీఆర్ఎస్ నేతలు 10 సంవత్సరాల పాలనా కాలంలో పేదలకు ఇల్లు కడితే ఇవాళ ఇందిరమ్మ ఇళ్ల కోసం వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏర్పడేది కాదు అన్నారు. పది సంవత్సరాలు ఈ రాష్ట్రంపై పడి దోచుకుంది కాక రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టి లక్షల కోట్లు అప్పులు తెచ్చారు, వారు తెచ్చిన అప్పులకు పది సంవత్సరాల తరువాత చెల్లింపులు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈరోజు వారు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని డిప్యూటీ సీఎం వివరించారు. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ఒకటి తర్వాత ఒకటి సంక్షేమ పథకాన్ని అమలు చేసుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ రోజుకు 18 గంటల పాటు పనిచేస్తూ రూపాయి రూపాయి పోగు చేసి ప్రతి పైసా పేదల కోసం ఖర్చు పెడుతున్నాం అన్నారు. గత దశాబ్ద కాలంగా ఇళ్ల కోసం పేదవారు కళ్ళు కాయలు కాసేలా చూసిచూసి అలసిపోయారు, ఇందిరమ్మ ప్రభుత్వం వస్తేనే ఇంటి కల నిజమవుతుందని ప్రజా ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే ఒక్కో ఇంటినీ 5 లక్షల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో నాలుగున్నర లక్షల ఇళ్లను ఈ ఏడాది నిర్మిస్తున్నాం అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మొదటి ఏడాది 22,500 కోట్లు ఖర్చు

చేస్తున్నాం, పేదల ఇళ్ల కోసం ఒక ఏడాదిలో ఇంత పెద్ద మొత్తంలో దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయడం లేదని తెలిపారు. మనసున్న ప్రభుత్వం పేదల బాధలను అర్థం చేసుకొని, కేవలం కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులకు మాత్రమే కాకుండా నిజమైన పేద వాళ్ళందరికీ ఇల్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కార్యక్రమం ఒక్క రోజులో తీసుకుంది కాదు అన్నారు.ఎన్నికల ముందు పిసిసి అధ్యక్షుడు హోదాలో సీఎం రేవంత్ రెడ్డి కొన్నిచోట్ల పాదయాత్ర మరికొన్ని చోట్ల బహిరంగ సభలు నిర్వహించగా, ప్రతిపక్ష నేతగా తాను ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నాలుగు నెలలపాటు పీపుల్స్ మార్చి పేరిట నడివేసవిలో సుదీర్ఘ పాదయాత్ర చేశానని ఆ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేక పేదలు పడుతున్న బాధలు గుర్తించి నిజమైన పేదలందరికీ ఇల్లు నిర్మిస్తామని మాట ఇచ్చిన విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తు చేశారు. పేదవాడు ఇల్లు కట్టుకోవడం అనేది ఓ సుదీర్ఘ కల, కొద్దిమంది ఈ కల నెరవేరకుండానే ప్రాణాలు కోల్పోయారు అని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకే ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు లేని పేదవారు ఏ ఒక్కరూ ఉండకూడదని, ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతికేందుకు ఎన్ని వేల కోట్లు అయినా ఖర్చు పెట్టేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు.ఇల్లు లేని పేదలు, కూలీలు తాత్కాలిక నివాసాలకు కిటికీలు, తలుపులు లేకుండా పడిన ఇబ్బందులను పాదయాత్ర సమయంలో తన చేయి పట్టుకుని చూపించిన ఉదంతాలను తాను ఇంకా మరవలేదు అన్నారు. తలుపులు కిటికీలు లేక బడికి పోయిన బిడ్డ కోసం వండిన అన్నాన్ని కుక్కలు తిని పోయిన దయనీయమైన పరిస్థితులను తన పాదయాత్ర సమయంలో పేదలు వివరించిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ప్రజల అవసరాల ఎజెండాగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుంది, రాష్ట్రంలో కోటి 12 లక్షల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నాం అన్నారు. రేషన్ బియ్యం వండుకునేందుకు పేదల కోసం 500 కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామని, పేదవారిపై భారం పడకుండా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ పంపిణీ చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు.వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న పని చేసుకునే ఓపిక ఉన్న వారి కోసం ఉపాధి కార్డు ఇచ్చి 100 రోజుల పని కల్పిస్తున్నాం, ఇంట్లో చదువుకునే పిల్లలు ఉంటే రెసిడెన్షియల్ విద్యార్థులకు 40 శాతం డైట్ 200 శాతం కాస్మోటిక్స్ చార్జీలు పెంచామని తెలిపారు. కాలేజీలకు వెళ్లే పిల్లల కోసం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నాం, చదువు పూర్తి చేసుకున్న వారి కోసం 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని వివరించారు. చదువుకున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం రాక శక్తి, ఆసక్తి ఉన్న యువత కోసం 8,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం అనే స్వయం ఉపాధి పథకాన్ని తీసుకువస్తున్నాం అని డిప్యూటీ సీఎం అన్నారు. ఇంట్లో వారికి ఆరోగ్యం బాగా లేకపోతే 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం చేయించుకునే అవకాశాన్ని ప్రజా ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర తోపాటు సన్న ధాన్యం పండించిన రైతులకు బోనస్ కింద క్వింటాకు 500 రూపాయలు చెల్లిస్తున్నాం అన్నారు.అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశాం ఇందుకోసం 21 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రుణమాఫీ తో పాటు పెట్టుబడి సాయం కింద ప్రతి సంవత్సరం సీజన్ కు 6,000 చొప్పున 12 వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం, ఈ వానాకాలం సీజన్ కు తొమ్మిది రోజుల వ్యవధిలోనే తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం రైతు భరోసా కోసం నేటి వరకు 17,500 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. మహిళలను మహారాణులుగా కొలవాలని మన నాగరికత, సంస్కృతి చెబుతుందని డిప్యూటీ సీఎం అన్నారు. మహిళల కోసం ఇందిరా క్రాంతి పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం 21 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించాం. ఐదు సంవత్సరాల కాలంలో కనీసం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నామని తెలిపారు.

తెలంగాణలో 1,07,218 ఇంజినీరింగ్ సీట్లు

ఉన్నత విద్యామండలి ప్రకటన - కన్వీనర్ కోటా కింద 76,795 సీట్లు భర్తీ
సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 76,494మంది హాజరు
ధృవపత్రాల పరిశీలనకు జులై 8వ తేదీ ఆఖరి గడువు
టీజీ ఈఏపీసెట్ కన్వీనర్ ఎ. శ్రీదేవసేన వెల్లడి

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం నేపథ్యంలో ఉన్నత విద్యా మండలి కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఎన్ని ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి? వాటిలో భర్తీ చేసే సీట్ల వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తంగా 171 ఇంజినీరింగ్ కళాశాలల్లో 1,07,218 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపింది. వీటిలో కన్వీనర్ కోటా (70శాతం) కింద 76,795 సీట్లు భర్తీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తూ ప్రత్యేక జాబితాను విడుదల చేసింది. మరోవైపు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు జులై 8వ తేదీ ఆఖరి గడువు అని తెలిపింది. అడ్మిషన్ల కోసం 95,654మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని.. 76,494మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారని తెలంగాణ సాంకేతిక విద్య కమిషనర్, టీజీ ఈఏపీసెట్ కన్వీనర్ ఎ. శ్రీదేవసేన ఓ ప్రకటనలో తెలిపారు. కన్వీనర్ కోటాలో బ్రాంచ్‌ల వారీగా అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను ఈ కింది పీడీఎఫ్‌లో చూడొచ్చు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు ప్రాతినిధ్యం

మహాసభ జిల్లా మాజీ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు బుక్క ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి లక్మిశెట్టి శ్రీనివాసు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, పట్టణ అధ్యక్షుడు వాస విద్యాసాగర్, శ్రీ బాలనరసింహ స్వామి దేవాలయ చైర్మన్ ఇమ్మడి వెంకటేశ్వర్లు, మార్కెట్ డైరెక్టర్ బూరుగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమం టిడిపికి రెండు కళ్ళు: గాజుల ఖాదర్బాషా

రాయచోటి జులై 06:- రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచన మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు. ఆదివారం నాడు రామాపురం కొత్తపేట వార్డుల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆయన కూటమి ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజల్లో ఉన్న భయం అశాంతి పోయి ఒక భరోసా ప్రశాంతత వచ్చింది అన్నారు రామాపురం నందు గత ప్రభుత్వంలో సక్రమమైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతుంటే వెంటనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి. తీసుకురాగా ఆయన రోడ్డు వేయించడం జరిగిందని తెలిపారు గత ప్రభుత్వంలో అమలు చేసిన అమ్మ ఒడి అరకొర ఇచ్చి మోసం చేస్తే చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంతమంది ఉన్న అందరికీ తల్లికి వందనం కింద 15000 రూపాయలు ఇవ్వడం జరిగిందని చెప్పారు గత ప్రభుత్వంలో పెన్షన్ కేవలం 250 రూపాయలు పెంచితే చంద్రబాబు నాయుడు ఏకంగా వెయ్యి రూపాయలు పెంచి ఇవ్వడం జరిగింది అని చెప్పారు కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రజలకు స్వేచ్ఛ ప్రశాంతత కలిగి మంచి ప్రభుత్వం వచ్చిందని ప్రజల నోట వినిపిస్తున్న మాట ఇదే అన్నారు ధాన్యం రైతులకు గత ప్రభుత్వం పెట్టిన 1600 కోట్ల బకాయిలను తెలుగుదేశం ప్రభుత్వం తీర్చిందన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుల బలరాం మల్లికార్జున తబ్రేస్ రోఫా రామాపురం నందుగుల తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

రాష్ట్ర ప్రజలందరూ చల్లగా ఉండాలి

రాయచోటి జులై 06:- తొలి ఏకాదశి సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకులు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం జరిగినది రాష్ట్రంలో రాష్ట్రంలో పాడి పంటలు పుష్కలంగా పండి అందరూ ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో యువత మంచి చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో ఉన్నత స్థాయికి చేరాలని వ్యాపారులకు వ్యాపారం సంసిద్ధంగా జరిగి మంచి లాభాలను చేకూరాలని కోరుకోవడం జరిగింది వైయస్సార్సీపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సిబ్బాల విజయభాస్కర్. రామాపురం మండల జడ్పిటిసి రమణ. వైసిపి రాష్ట్ర కార్యదర్శి సురం వెంకట సుబ్బారెడ్డి. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుగవాసి శ్యామ్ కుమార్. జిల్లా టూరిజం కౌన్సిలర్ నెంబర్ కొత్తిమీర ప్రసాద్.

నిమిషాల్లో భూమి మాయం, 43 మంది మృతి, 27 మంది బాలికలు గల్లంతు

అమెరికా :అమెరికాలోని టెక్సాస్‌లోని హంట్ ప్రాంతంలో కుండపోత వర్షాలు ఉగ్రరూపం దాల్చాయి. నది ఉప్పొంగడంతో తీరంలో ఏర్పాటు చేసిన ఒక క్రిస్టియన్ క్యాంపును వరద నీరు పూర్తిగా ముంచెత్తింది. కుండపోత వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ జల ప్రళయంలో 43 మంది మృతి చెందగా.. ఓ క్రిస్టియన్ సమ్మర్ క్యాంపు నుంచి 27 మందికి పైగా బాలికలు గల్లంతయ్యారు. మరోవైపు అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేస్తున్నారు. ప్రకృతి ప్రకోపిస్తే ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. నిమిషాల్లో భూమి మాయమైంది. 51 మంది మృతి చెందారు. 27 మంది బాలికలు కనిపించకుండా పోయారు. ఇదీ.. అగ్రరాజ్యం అమెరికాలోని టెక్సాక్ రాష్ట్రానికి సంభవించిన వరదల విలయతాండవం.టెక్సాస్, అమెరికా జులై, 6: ప్రకృతి ప్రకోపిస్తే ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. నిమిషాల్లో భూమి మాయమైంది. 51 మంది మృతి చెందారు. 27 మంది బాలికలు కనిపించకుండా పోయారు. ఇదీ.. అగ్రరాజ్యం అమెరికాలోని టెక్సాక్ రాష్ట్రానికి సంభవించిన వరదల విలయతాండవం.కెర్ కౌంటీలో వరదల కారణంగా 15 మంది పిల్లలు సహా కనీసం 43 మంది మరణించారు. సమీపంలోని కౌంటీలలో కనీసం ఎనిమిది మంది చనిపోయారు.విధ్వంసకరంగా కనిపిస్తున్న చెట్లు, బోల్తాపడి చెట్ల మీద, కల్వర్టుల మీదా కూర్చొన్న కార్లు, బురదతో నిండిన శిథిలాలతో సెంట్రల్ టెక్సాస్ భయానకంగా మారింది.కెర్ కౌంటీలోని నది వెంబడి ఉన్న క్రైస్తవ వేసవి శిబిరం అయిన క్యాంప్ మిస్టిక్ లో ఎంతో ఆనందంగా ఉల్లాసంగా అభ్యసిస్తున్న 27 మంది బాలికలు వరద నీటిలో కొట్టుకుపోయారు. వీరి ఆచూకీ ఇంకా తెలియకుండా ఉంది.శుక్రవారం తెల్లవారుజామున కేవలం 45 నిమిషాల్లోనే గ్వాడాలుపే నది విధ్వంసకరంగా మారిపోయింది. వేగంగా ప్రవహించుకుంటూ వచ్చిన వరదనీరు నిమిషాల్లోనే 26 అడుగులు (8 మీటర్లు) ఎత్తు పెరిగి ఇళ్ళు, వాహనాలను తుడిచిపెట్టాయి.అటు, శనివారం కూడా శాన్ ఆంటోనియో వె